

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మాచర్ల : మాచర్ల ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. హోమం చేశారు.



వైభవంగా పౌర్ణమి పూజలు

రేపల్లెరూరల్: శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యన్నదానానికి తెనాలిలోని చినరావూరు చెందిన జిట్టా విజయలక్ష్మి సోమవారం రూ.1,00,001 విరాళం ఇచ్చారు.

న్యూస్‌రీల్

శ్రావణలక్ష్మి అలంకారంలో బాలచాముండేశ్వరి



అమరావతి:అమరేశ్వరాలయంలో సోమవారం బాల చాముండేశ్వరిదేవి శ్రావణలక్ష్మిగా దర్శనమిచ్చారు. గాజులతో అలంకరించిన అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమరేశ్వర ఘాట్‌లో వేంచేసి ఉన్న కృష్ణవేణి మాత విగ్రహానికి అభిషేకం చేసి అలంకరణ చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణవేణి మాతకు వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ బాల చాముండేశ్వరిదేవికి అలంకరించిన గాజులను రేపటి నుంచి ముత్తయిదువలకు పంపిణీ చేస్తామన్నారు. పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాలక్ష్మికి కుంకుమార్చన



నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మహాలక్ష్మికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తూరి వెంకట శివవేణుగోపాలరావు, నాగమల్లిక దంపతుల ఆధ్వర్యంలో 158మంది మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న మహిళలకు చీర జాకెట్, పసుపు కుంకుమలు, గాజులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్, కోశాధికారి మైలవరపు ధనుంజయ, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల నుంచి ఎయిమ్స్‌కు ప్రత్యేక బస్సులు



మాచర్ల: పల్నాడు ప్రాంత పేద ప్రజలు గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లేందుకు మాచర్ల డిపో నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రెండు బస్సు సర్వీసులను స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంతో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 6.30 మాచర్ల పట్టణంలో బయలుదేరి 10.45 గంటలకు ఎయిమ్స్ ఆసుపత్రికి చేరుకుంటుందని, మరో బస్సు మధ్యాహ్నం 12.45 గంటలకు మాచర్ల నుంచి మరో బస్సు బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు ఎయిమ్స్ ఆసుపత్రికి చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేద ప్రజల వైద్యం కోసం ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య, సూపర్‌వైజర్ నాయక్, టీడీపీ నాయకులు శివారెడ్డి, శ్రీనివాయాదవ్, వేముల దుర్గ, బ్రహ్మం, భాస్కరరావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 36,162 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 36,162 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,928 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ. 4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,098 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బేరసారాలు షురూ

- జిల్లాలో బదిలీల ప్రక్రియ ప్రారంభం
- ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖల కోసం ఉద్యోగుల పాట్లు
- ప్రాంతం, పోస్టును బట్టి వసూళ్లు
- ప్రధానమైన పోస్టింగులలో తమ అను'కుల' వర్గాల కోసం పట్టు
- కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని పెదకూరపాడు టీడీపీలో రచ్చ
- నరసరావుపేటలో బదిలీల ప్రక్రియలో పట్టు కోసం కూటమి నేతల ఎత్తులు



సాక్షి, నరసరావుపేట: ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికార పార్టీ నేతలు బేరసారాలకు తలుపులు బార్లా తెరిచారు. ఉద్యోగులు కోరుకున్న చోటుకు బదిలీ అయ్యేందుకు అవసరమైన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు లెక్కకట్టి బేర మాడుతున్నారు. మరో వైపు తమకు అనుకూలమైన ఉద్యోగులకు పోస్టింగులు ఇప్పించుకునేందుకు ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. బేరాలు చేయలేని, అధికారపార్టీ అండదండలు లేని నిస్వార్థ ఉద్యోగులు మాత్రం తమకు పోస్టింగ్ ఎక్కడ పడుతోందనన్న ఆందోళనలో సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బదిలీల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. మొత్తం 15 శాఖల్లోని బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 31వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తొలగించారు. ఎక్సైజ్ వంటి శాఖలకు కొంత అదనపు సమయం కూడా ఇచ్చారు. అయితే ఈ బదిలీలలో వైద్య, విద్యాశాఖలకు సంబంధించిన డాక్టర్లు, ఉపాధ్యాయులకు చోటు లేదు. జిల్లాలో మొత్తం 28 మండలాల పరిధిలో వేలాది మందికి స్థానచలనం కానుంది.

ప్రాంతం, పోస్టును బట్టి రేటు

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖలకు సంబంధించి జిల్లాలో కీలకమైన ప్రాంతాల్లో పోస్టింగులకు బాగా డిమాండ్ ఉంది. అధికార పార్టీ నేతలతో ఉన్న పలుకుబడిని ఉపయోగించి ముమ్మరంగా పైరవీలు జరుగుతున్నాయి. ప్రధానంగా నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, గురజాల, దాచేపల్లి పోస్టులకు భారీగా పోటీ నెలకొంది. ఈ స్థానాల కోసం రూ.10 లక్షల వరకు బేరాలు సాగుతుండటం విశేషం. వీటికి అదనంగా కూటమి కార్యకర్తలు చెప్పినట్టు నడుచుకోవాలని షరతులు పెడుతున్నారట. మరోవైపు ఎక్సైజ్, దేవదాయశాఖల పోస్టులకు పల్నాడులో పెద్దఎత్తున పోటీ నెలకొంది. చిన్న చిన్న ఉద్యోగులు సైతం రూ.లక్ష అయినా ఇచ్చి తమకు అనుకూలమైన చోట పోస్టింగు ఇప్పించాలని ప్రజాప్రతినిధుల వద్ద తిరిగే నాయకుల వెంట పడుతున్నారట.

అను'కుల' ఉద్యోగుల కోసం...

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేసిన పోలీసుశాఖలోని సీఐ, ఎస్‌ఐ పోస్టింగులలో కుల సమీకరణ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అధికార పార్టీకి అనుకూలమైన వర్గాలకు చెందిన ఉద్యోగులకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. వారికి మంచి స్థానాల్లో పోస్టింగులు ఇవ్వడంతోపాటు ఇతర చోట్ల ఎవరికి ఇవ్వాలో కూడా వారే నిర్ణయించారు. కొన్నిచోట్ల వారికి అనుకూలంగా లేని వారికి పోస్టింగులు పడటంతో వారి గురించి కొన్ని పత్రికలు, కూటమి పార్టీల కార్యకర్తలతో సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకంగా ప్రచారాలు చేయించి పోస్టింగులు రద్దు చేయించిన ఘటలను చూశాం. తాజా బదిలీలలో ఓ సామాజికవర్గ ఉద్యోగులకు పెద్దపీట వేస్తున్నారు. 2014–19 మధ్య ఆయా ప్రాంతాలలో పనిచేసిన ఉద్యోగులను మళ్లీ పోస్టింగులు వేయించి గతంలో మాదిరి దోపిడీ చేయడానికి కొందరు ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

పట్టు కోసం పాట్లు

నరసరావుపేట నియోజకవర్గంలో అధికారుల బదిలీలలో పట్టు కోసం కూటమి పార్టీ నేతలు పాట్లు పడుతున్నారు. ఇక్కడ కూటమి పార్టీ నేతలు గ్రూపులుగా విడిపోయారు. ఎవరికి వారు తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగులను పేటకు రప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే మాత్రం ఓ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను కీలకమైన స్థానాల్లో ఉంచేందుకు ఇష్టపడటంలేదని సమాచారం. మరోవైపు పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ నేతల్లో కొంతకాలంగా వర్గపోరు పెరిగింది. ఐదేళ్లు వైఎస్సార్ సీపీలో ఉండి ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చిన నేతలకు భాష్యం ప్రవీణ్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఓ వర్గం మదనపడుతోంది. తాజా బదిలీల్లోనూ తమ మాట నెగ్గడంలేదని, అధిష్టానం వద్ద ఈ విషయం తేల్చుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ఆర్డీవో పోస్టుకు పోటీ

- నరసరావుపేట ఆర్డీఓ పోస్టుకు పోటీ తీవ్రంగా ఉంది. ఈ పోస్టు కోసం టీడీపీ అను'కుల' సామాజిక వర్గానికి చెందిన ఓ ఆర్డీఓ స్థాయి ఉద్యోగి చినబాబు లోకేష్ ద్వారా లాబీయింగ్ చేయిస్తున్నట్టు సమాచారం.
- నరసరావుపేట డిప్యూటీ తహసీల్దార్ పోస్టింగ్ విషయమై ఎమ్మెల్యే అరవింద్‌బాబు, ఎంపీ లావు అనుకూల వర్గాలకు మధ్య పోరు నడుస్తున్నట్టు తెలుస్తోంది.
- నరసరావుపేట, గురజాల రిజిస్ట్రేషన్ శాఖ సబ్ రిజిస్ట్రార్ పోస్టు కోసం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యులతో చనువుగా ఉండే జిల్లాకు చెందిన ఓ యువ నాయకుడి ద్వారా రూ.10 లక్షల వరకు బేరాలు జరుగుతున్నట్టు సమాచారం.
- గురజాల ఎక్సైజ్ సీఐ పోస్టు కోసం రూ.5 లక్షల దాకా ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని సమాచారం.
- ఇసుక నిల్వలు అధికంగా ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో రెవెన్యూ, మైనింగ్ పోస్టులకు రూ.లక్షలు ఇచ్చి అక్కడికి వెళ్లడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.
- కారంపూడిలో కీలక పోస్టుల కోసం ఓ వర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని కలుస్తుండగా, మరో వర్గం పక్క నియోజకవర్గం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలుస్తున్నట్టు తెలుస్తోంది.
- అమరావతి, కోటప్పకొండ దేవస్థానాలలో పోస్టింగుల కోసం పోటీ తీవ్రంగా ఉంది.
- నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ పోస్టుకు ఎమ్మెల్యే అరవింద్‌బాబు తనకు వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక ముగ్గురు ఉద్యోగులకు సిఫార్సు లేఖ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఉద్యోగులలో అయోమయం నెలకొంది.

టీడీపీ కార్యాలయంలో కత్తులతో స్వైర విహారం



నరసరావుపేట టీడీపీ కార్యాలయం బయట కత్తితో తిరుగుతున్న టీడీపీ కార్యకర్తలు

నరసరావుపేటటౌన్:నరసరావుపేటలో తెలుగు తమ్ముళ్ల మధ్య అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరి పరస్పర భౌతిక దాడులకు దిగుతున్నారు. 15 రోజుల కిందట నరసరావుపేటలో ఎమ్మెల్యే అరవిందబాబు సాక్షిగా, ఆయన ఇంట్లోనే ఘర్షణకు దిగి రచ్చకెక్కిన తమ్ముళ్లు.. తాజాగా టీడీపీ కార్యాలయంలో కత్తులతో స్వైరవిహారం చేశారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. రహదారిపై కత్తులతో సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బీసీ కాలనీ చెందిన టీడీపీ నాయకుడు రమేష్, బాబా పేటకు చెందిన మాబుకు మధ్య విభేదాలు ఉన్నాయి. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఇరువర్గాలు ఎదురుపడ్డాయి. మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. రమేష్, అతని అనుచరులు కత్తితో మాబుపై దాడి చేయబోగా మాబు అనుచరుడు కరిముల్లా అడ్డుపడడంతో ఆయన చేతికి బలమైన గాయమైంది. గాయపడిన కరిముల్లాకు ఎమ్మెల్యే ఆసుపత్రిలోనే చికిత్స అందించారు. ఘర్షణ నేపథ్యంలో ఇరువర్గాలు పార్టీ కార్యాలయం వద్ద కత్తులతో స్వైర విహారం చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఘర్షణకు దిగిన నాయకులను గుర్తించి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఫిర్యాదులు ఇవ్వలేదు..

టీడీపీ కార్యాలయంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారన్న సమాచారంతో అక్కడకు చేరుకున్నామని పేట టూటౌన్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. బైండోవర్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రక్తమోడిన రహదారులు

నిర్లక్ష్యమే కారణమా?

- వేర్వేరు ప్రమాదాలలో ఆరుగురు మృతి
- శుభకార్యాలకు వెళ్లి వస్తూ ఐదుగురు మృతి
- నలుగురికి గాయాలు

జిల్లాలోని రహదారులు రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. నలుగురు గాయాలపాలయ్యారు. కారును ఓవర్‌టేక్ చేయబోయి ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు, మరో శుభకార్యానికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తూ ఆగి ఉన్న లారీని ఢీకొని మరో ముగ్గురు, రోడ్డు మీద నిల్చున్న వ్యక్తి కారు ఢీకొట్టగా ఒకరు ప్రాణాలు కోల్పోయారు. నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. దీంతో ఆయా కుటుంబాలలో విషాదం నెలకొంది.



కె.ఇందు



అమూల్య



నాగతేజారెడ్డి

పిడుగురాళ్ల: శుభకార్యానికి వెళ్లి వస్తూ ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు టోల్‌గేటు సమీపంలో సోమవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కె.ఇందు (36) ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తోంది. గురజాలలో తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి తన కుమార్తె అమూల్య (15), పరిచయస్తుడు ఎం.నాగతేజారెడ్డి (25)లతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. కార్యక్రమం పూర్తి చేసుకుని తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా తుమ్మల చెరువు టోల్‌గేట్ సమీపంలోని భారత్ పెట్రోలు బంకు ఎదురుగా లారీ ఆగి ఉంది. వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని వెనుకగా ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇందు, అమూల్య, నాగతేజారెడ్డిలు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తెల్లవారుజామున కాబట్టి ఎవరూ లేకపోవడంతో కేసు అవుతుందనే భయంతో లారీ తీసుకుని వెళ్లారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా, సీఐ వెంకట్రావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

మనుమరాలి ఓణీల ఫంక్షన్‌కు వెళ్లి వస్తూ...

నాదెండ్ల: ఓణీల ఫంక్షన్‌కు హాజరైన తాత, నాయనమ్మలు మనుమరాలిని చూసి మురిసిపోయారు. ఆమెకు దీవెనలు అందించారు. తిరిగి సంతోషంగా ఇంటికి బయలుదేరారు. ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు తాత ఆంజనేయులును, మరొకరిని కబళించింది. ఎస్‌ఐ జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. నరసరావుపేట ఎన్జీవోస్ కాలనీకి చెందిన కనుమూరి ఆంజనేయులు (75), కుమారిల కుమారుడు శ్రీనివాసరావు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరావుకు బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వీరి కుమార్తెకు నరసాయపాలెంలో సోమవారం ఓణీల ఫంక్షన్ ఏర్పాటుచేశారు. ఈ ఫంక్షన్‌కు ఆంజనేయులు దంపతులతోపాటు సమీప బంధువులైన ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన సూరె ప్రభావతి (55), నరసరావుపేట ఎన్జీవోస్ కాలనీకి చెందిన జాస్తి బాబు హాజరయ్యారు. శుభకార్యం ముగిసిన అనంతరం ఆంజనేయులు, ప్రభావతి, జాస్తి బాబులు ఓ కారులో నరసరావుపేట బయలుదేరారు. నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద నరసరావుపేట–చిలకలూరిపేట రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు మరో కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఆంజనేయులు, ప్రభావతి సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కారు డ్రైవర్ భూపతి, జాస్తి బాబు గాయాలపాలు కావటంతో 108 వాహనంలో నరసరావుపేట తరలించారు. కారు డోర్లు లాక్ అయ్యాయి. దీంతో స్థానికులు అతి కష్టం మీద డోర్లు తెరచి క్షతగాత్రులు, మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను నరసరావుపేట ఏరి యా ఆసుపత్రికి తరలించారు. నరసరావుపేటకు చెందిన ఆంజనేయులు వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఇరువురి మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సంఘటనా స్థలాన్ని చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బనాయుడు, ఎస్‌ఐ జి పుల్లారావు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది.



అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు



సంఘటనా స్థలంలో ఆంజనేయులు మృతదేహం



మృతురాలు సూరె ప్రభావతి

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి



లారీని, డ్రైవర్‌ను ఢీకొట్టిన కారు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామ సమీపంలో గల కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట నుంచి బొప్పాయి కాయల లోడ్‌తో లారీ ఉత్తరప్రదేశ్‌కు వెళ్తుంది. మార్గమధ్యంలో లారీని పార్క్ చేసి డ్రైవర్ శ్రీపతి ప్రభాకర్(47) కాలకృత్యాలు తీర్చుకున్నాడు. అనంతరం లారీ వద్దకు వచ్చాడు. అదే సమయంలో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు లారీ పక్కనే ఉన్న ప్రభాకర్‌ను, లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వీరేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మృతి చెందిన లారీ డ్రైవర్ ప్రభాకర్ తెనాలి ఏరియాలోని కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గాయాలైన ఇరువురిని అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రొంపిచర్ల ఎస్‌ఐ డి.అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేము అర్హులమే..

మా పింఛన్లు తీసేయవద్దు

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కోరిన పిచికలపాలెం వాసులు
- నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి: కలెక్టర్
- 62 అర్జీలు స్వీకరణ



కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: మేమంతా కొన్నేళ్లుగా పింఛన్లు తీసుకుంటున్నాం, వాటికి మేము అర్హులమేనని. వాటిని తొలగించవద్దని శావల్యాపురం మండలం పిచికలపాలెంకు చెందిన పలువురు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వారు హాజరై వినతిపత్రం సమర్పించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో కె.వినాయకంలతో కలిసి కలెక్టర్ అరుణ్‌బాబు ప్రజల నుంచి పలు సమస్యలపై 62 అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధ్యతతో పనిచేసి ప్రజలు నుంచి వచ్చే వినతులకు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతినెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈనెల 24న తొలి వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనిని షెడ్యూల్డు కులాలు, తెగల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

లిఫ్ట్ స్కీంలు పనిచేయించండి

జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది నాగార్జునసాగర్ నిండి కాలువలకు సమృద్ధిగా నీరు వస్తుంది. రైతులు వరి సేద్యంపై దృష్టి సారించారు. జిల్లాలో పలుచోట్ల ఉన్న లిఫ్ట్ యంత్రాలు పనిచేయట్లేదు. ఆయకట్టుకు నీరు అందటం ప్రశ్నార్థకంగా మారింది. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సక్రమంగా అందేలా చూడాలి. అక్కడక్కడా బ్లాక్‌లో వీటిని విక్రయిస్తున్నారు. అటువంటి వాటిని నియంత్రించండి.

–ఉలవలపూడి రాము, ఏపీ రైతుసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి



కలెక్టరేట్‌లో శావల్యాపురం మండలం పిచికలపాలెం వాసులు

రాజకీయ కక్షతోనే నోటీసులు

మేమంతా కూలి పనులు చేసుకొని బతికేవాళ్లం. కొన్నేళ్లుగా పింఛన్లు తీసుకుంటున్నాం. మా పింఛన్లు ఎందుకు రద్దు చేయకూడదో చెప్పండి అంటూ నోటీసులు ఇచ్చారు. మేము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమనే కక్షతోనే మాకు పింఛన్లు అందనీయకుండా చేయాలని కుట్ర పన్నారు. వాస్తవానికి మాకు రాజకీయాలతో సంబంధం లేదు. దయచేసి మమ్మల్ని కొనసాగించండి.

–టి.వీరాంజనేయులు, ఆర్.బాబు, కె.చినలక్ష్మయ్య

అసెంబ్లీలో తీర్మానం చేయాలి

కొన్నేళ్లుగా ముస్లిం ఆస్తులకు భరోసా కల్పిస్తూ ఉన్న వక్ఫ్ చట్టాన్ని సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది. దీనికి వ్యతిరేకంగా అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం తీర్మానం చేయాలి. ఈ బిల్లు అమల్లోకి వస్తే వక్ఫ్ ఆస్తులు ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అందువలన అఖిలపక్షం ఏర్పాటుచేసి ప్రతి రాజకీయపార్టీ అభిప్రాయం తీసుకోవాలి.

–షేక్ కరిముల్లా, మౌలాలి, ఎంఐఎం నాయకులు



కలెక్టర్‌కు వినతి చేసేందుకు వచ్చిన ఎంఐఎం నాయకులు

క్లుప్తంగా

జీజీహెచ్‌లో పటిష్ట భద్రత చర్యలు

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పక్కా ప్రణాళికతో రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ తెలిపారు. ఆసుపత్రి శుశ్రుత హాలులో సోమవారం పటిష్ట బందోబస్తుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రహరీకి ఆనుకుని వ్యాపారాలు చేస్తున్న వారి గురించి నగర పాలక సంస్థ కమిషనర్‌తో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు, నగర పాలకసంస్థ అధికారులతో చర్చి ప్రణాళిక ప్రకారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రధాన విభాగాల వద్ద కూడా రక్షణ కల్పిస్తామన్నారు. త్వరలో మెడికల్ శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాత్రి సమయంలో అసాంఘిక శక్తులు ఆసుపత్రిలో చొరబడుతున్నారని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కంచికచర్ల: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనగా ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ఓ వ్యక్తి నందిగామ నుంచి విజయవాడ వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. స్థానిక చెరువుకట్ట సమీపంలోని ఫ్లైఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సంచిని సోదా చేయగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పామర్తి శ్రీనివాసరావు అనే చిరునామా కలిగిన ఆధార్‌కార్డు లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి గురించి పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పందెం డబ్బు చెల్లించాలంటూ వేధిస్తున్నారు

- టీడీపీ నాయకులపై ఫిర్యాదు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: గత ఎన్నికలలో ఫలితాలపై నాకు తెలియకుండా నా కుమారుడు పెట్టిన రూ.10లక్షల పందెం చెల్లించాలంటూ టీడీపీ నాయకులు వేధిస్తున్నారని నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏరువ శివారెడ్డి, రమణ దంపతులు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైన ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

కులం పేరుతో దూషించారు

నా కుటుంబం మేళ్లవాగు మెయిన్ రోడ్డుకు సమీపంలో 40 ఏళ్ల కిందట షెడ్డు వేసుకొని టిఫిన్ బండి నిర్వహించుకుంటూ జీవిస్తున్నాం. కొత్త ప్రభుత్వం రాగానే టీడీపీకి చెందిన శివకుమార్ అనే వ్యక్తి టిఫిన్ బండి తీసేయాలని మాపై దౌర్జన్యం చేశాడు. నన్ను కులం పేరుతో దూషించి కాలితో గుండెలపై తన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు. మీరైనా చర్యలు తీసుకోవాలి.

–సలగాల మల్లీశ్వరి, మేళ్లవాగు, బొల్లాపల్లి మండలం

మిర్చి పంట తీసుకొని డబ్బులు ఇవ్వట్లేదు

మార్కెండేయులు, శ్రీనివాస్‌లకు సుమారు రూ.1,42,18,914లు విలువైన మిర్చిపంటను అమ్మాము. మాకు రూ.23లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా తిరుగుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని మా డబ్బులు మాకు ఇప్పించండి.

–అంబటి నరసింహారావు, మరికొంతమంది రైతులు, పెదపాలెం, అచ్చంపేట మండలం

ఉద్యోగం మానుకోవాలని వేధిస్తున్నారు...

ఐదేళ్ల నుంచి యానిమేటర్‌గా పనిచేస్తున్న నన్ను ఉద్యోగం మానుకోవాలని టీడీపీ నాయకులు వేధిస్తుంటే ఉద్యోగం మానుకుంటానని చెప్పినా తప్పుడు పత్రాలతో బాకీలు చూపించి అవి కట్టాలంటూ వేధిస్తున్నారని వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లికి చెందిన ఓ మహిళ తన కుమార్తెతో వచ్చి జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసింది. నా కుమార్తె బయటకు వెళ్లినా ఓ ఎస్సీ యువకుడుచే మీరెలా ఉద్యోగం చేస్తారంటూ వెంటపడి వేధిస్తున్నారు. నా భర్తను గతంలో ద్విచక్రవాహనంతో ఢీకొట్టి గాయాలపాలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కావున వారి బారి నుంచి నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి.

అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడు

నా భర్త అదనపు కట్నం కావాలంటూ వేధిస్తున్నాడు. మరో వివాహం చేసుకుంటాను నీవు రావొద్దు అంటున్నాడు. దీనికి భర్త తాలూకా బంధువులు వంతపాడుతున్నారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి.

–వి.రామలింగేశ్వరి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

టీడీపీ నాయకులు వేధిస్తున్నారు



నా కుమారుడు లోకేశ్వరరెడ్డికి వివాహమైంది. భార్యతో విడిగా కాపురం ఉంటున్నాడు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడైన ఇండ్లమూరి తిరుపతిరావుతో నా కుమారుడికి స్నేహం ఉంది. నా కుమారుడికి రూ.10వేలు కూడా అప్పు ఇవ్వొద్దని అతనికి చెల్లించే స్తోమత లేదని ఇంతకుముందే తిరుపతిరావుకు చెప్పాను. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు సాయంత్రం అతను నాకు ఫోన్‌చేసి మీ అబ్బాయి రూ.10లక్షలు పందెం పెట్టి ఓడిపోయాడు. ఆ రూ.10లక్షలు కట్టాలని చెప్పాడు. నా కుమారుడి గురించి ఇంతకుముందే నీకు చెప్పాను, నీవు ఏవిధంగా పందెం పెట్టుకున్నావని అడిగాను. ఆ డబ్బుల కోసం గ్రామ టీడీపీ నాయకులు హరిబాబు, తిరుపతిరావులు రూరల్ ఎస్ఐచే నాకు ఫోన్ చేయించి స్టేషన్‌కు పిలిపించి డబ్బులు కట్టాల్సిందేనంటూ బెదిరించారు. నాకు ఆ స్థోమతలేదు. నా కుమారుడు ఇల్లు వదిలి రెండు నెలలు అవుతుంది. మీరే నా కుటుంబాన్ని కాపాడాలి.

–ఏరువ శివారెడ్డి, రమణ దంపతులు, పెదరెడ్డిపాలెం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నాకు వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పవన్‌కుమార్ అనే వ్యక్తి రూ.3.5లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించలేదు, డబ్బులు ఇవ్వట్లేదు. అతనిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.

–లక్ష్మీ కల్పనాభాయి, నాగార్జుననగర్, సత్తెనపల్లి టౌన్

ప్రకాశం జట్టుపై గుంటూరు ఘనవిజయం

- 10 వికెట్ల తేడాతో గుంటూరు విజయం
- గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టుపై గుంటూరు జట్టు ఘన విజయం సాధించింది. మూడు రోజులపాటు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి 10 వికెట్ల తేడాతో ప్రకాశం జట్టును చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు కట్టడి చేసిన గుంటూరు జట్టు 390 సాధించి 115 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రకాశం జట్టు ఆదివారం నాటి రెండు వికెట్లు నష్టానికి 44 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం బ్యాటింగ్ ప్రారంభించి రెండో ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని పి.నందకిషోర్ 49 పరుగులు సాధించి పరుగు తేడాతో అర్ధ సెంచరీ మిస్ అయ్యాడు. గుంటూరు బౌలర్ సిద్ధూ 15 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, వీపీఎస్ రెడ్డి 13 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 80 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు 15.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. గుంటూరు బ్యాట్స్‌మెన్‌లు కె.ఎల్.శ్రీనివాస్ 44, రోనే 36 పరుగులు సాధించారు. భారీ విజయం సాధించిన గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీ తాపతిరావు పర్యవేక్షించారు.



సిద్ధూ, 4 వికెట్లు, గుంటూరు.

టీకాలు సద్వినియోగం చేసుకోండి

- పోస్టర్లు, టీకాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ఈనెల 20 నుంచి సెప్టెంబరు 18వరకు కార్యక్రమం
- రైతుల ఇళ్ల వద్దకే వచ్చి పశువులకు టీకాలు వినియోగం

నరసరావుపేట: జిల్లాలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి, బ్రోసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను రైతు పశు పోషకులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రెండు వ్యాధుల నిరోధక టీకాల కార్యక్రమాలకు చెందిన పోస్టర్లు కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆరు నెలలు నిండిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు ఉన్న పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను రైతుల ఇళ్లవద్దకే వచ్చి ఉచితంగా వేస్తారన్నారు. జిల్లాలో 4.36లక్షలు గాలికుంటు వ్యాధి టీకాలు, 38,500 బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కంచర్ల కాంతారావు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ, డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన నేరస్తులను అరెస్ట్ చేయాలి

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చిన రామిరెడ్డి
- సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీజీఈఏ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

సత్తెనపల్లి: కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్యశాలలో మెడిసిన్ పీజీ విద్యార్థిని మౌమితపై లైంగికదాడి చేసి అనంతరం హత్య చేసిన నేరస్తులను అరెస్ట్ చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చిన రామిరెడ్డి డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం పల్నాడు జిల్లా శాఖ, సత్తెనపల్లి తాలూకా యూనిట్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిన రామిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సంఘటన మానవత్వానికి మాయని మచ్చ అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి నిందితులను రాజకీయాలు, పార్టీలతో ప్రమేయం లేకుండా అరెస్టు చేసి కఠినంగా శిక్ష విధించాలన్నారు. రాత్రి వేళల్లో మహిళలకు డ్యూటీలు వేయరాదని, పనిగంటలు ఎనిమిది గంటల వరకు మాత్రమే నియంత్రించాలని, మహిళా ఉద్యోగులు ఉన్నచోట వారికి మీటింగ్ రూమ్స్, టాయిలెట్స్, కరెంటు లైటింగ్ ఫెసిలిటీ తప్పనిసరిగా ఉండాలని, నైట్ డ్యూటీ చేసే వారికి రాత్రి వేళల్లో 12 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు మహిళా పోలీసుల విజిటింగ్ తప్పనిసరిగా ఉండాలని, ఉన్నతాధికారులు ప్రభుత్వ హాస్పిటల్స్‌ను, కార్యాలయాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ బసవ కుమారి, నరసరావుపేట తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్, లక్ష్మీజ్యోతి, చలమారెడ్డి, ఉపాధ్యక్షులు సీహెచ్ ఆనంద్‌కుమార్, ట్రెజరర్ పీటర్ డామియన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న ఏపీజీఈఏ ఉద్యోగ సంఘ నాయకులు

సముద్రంలో మునిగి మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన గజ ఈతగాళ్లు, మెరైన్ సిబ్బంది

బాపట్లటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన చందోలు లక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో ఉదయం సూర్యలంక సముద్రతీరానికి చేరుకొని మధ్యాహ్నం సమయంలో సముద్రంలో లోతుకు వెళ్లి మునిగి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. పోలీసులు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా హెచ్చరిస్తున్నప్పటికీ సముద్రంలో ఇంకా లోతుకు వెళుతూ మునిగిపోసాగింది. ఈ విషయాన్ని గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై వెంటనే సముద్రంలోకి వెళ్లి మహిళను కాపాడి తీరానికి తీసుకువచ్చారు. అనంతరం రూరల్ సీఐ గంగాధరరావు మహిళకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. మహిళను కాపాడిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.



ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

స్థలం వివాదంలో పాస్టర్‌పై దాడి

- ఇల్లు ధ్వంసం.. అడ్డువచ్చిన భార్యపైనా దాడి
- ఫిర్యాదు చేసిన బాధితుడు
- కేసు నమోదులో పోలీసుల జాప్యం

కొల్లూరు: స్థలం విషయంలో ఓ పాస్టర్‌పై దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని దోనేపూడికి చెందిన మోక జయరాజు 2012లో దోనేపూడిలో పల్లెకొండ కుమారి అనే మహిళ వద్ద 7 సెంట్లు ఇంటి స్థలం కొనుగోలు చేశాడు. ఆ స్థలంలోనే చర్చి నిర్మించుకొని ప్రార్థనలు చేస్తూ భార్య, పిల్లలతో కలసి జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆ స్థలాన్ని ఆనుకొని హార్వెస్ట్ ఇండియా మినిస్ట్రీస్ డైరెక్టర్ కత్తెర సురేష్‌కు సైతం స్థలం ఉండటంతో జయరాజుకు చెందిన స్థలాన్ని తమకు అప్పగించాలని వారు ఒత్తిడి తీసుకొస్తున్నారు. గత నెల 28న జయరాజు ఇంటి వద్ద లేని సమయంలో కత్తెర సురేష్, తెనాలికి చెందిన సుద్దపల్లి నాగరాజు, ఇమ్మడి నిరీక్షణ జ్యోతి అనే ముగ్గురు వ్యక్తులు వెళ్లి ఆ స్థలం తమదని నెలాఖరులోపు అప్పగించకపోతే మీ అంతుచూస్తామని బెదిరింపులకు పాల్పడటంతోపాటు, అసభ్య పదజాలంతో పాస్టర్ భార్య ఉషారాణిని దూషించారు. బెదిరింపుల విషయం తెలుసుకున్న పాస్టర్ జయరాజు కోర్టుని ఆశ్రయించడంతో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేసింది.

అయితే ఈనెల 16న స్థలం విషయమై కత్తెర సురేష్ చర్చించమన్నారంటూ సుద్దపల్లి నాగరాజు అనే వ్యక్తి ఫోన్‌చేసి సాయంత్రం అందుబాటులో ఉండాలని సూచించాడు. దీనిపై బాధితుడు జయరాజు తమకు స్థలం విక్రయించిన మహిళ భర్త ప్రకాష్‌ను సైతం తీసుకురావాలని కోరడంతో ప్రకాష్‌తోపాటు నాగరాజు అనే వ్యక్తి మరి కొంతమందిని తీసుకొని వెళ్లాడు. స్థలం విషయమై చర్చలు జరుగుతున్న సమయంలో రూ. 3 లక్షలు తీసుకొని స్థలం ఖాళీ చేసి వెళ్లాలని డిమాండ్‌కి దిగారు. ఈక్రమంలో తనకు ఆ స్థలమే ఆధారమని వాపోయిన బాధితుడు, మీకున్న స్థలం ధర ఎంతో చెబితే తానే ఆ నగదు చెల్లిస్తానని అనడంతో నాగరాజు అసభ్య పదజాలతో దూషిస్తూ బిషప్ కత్తెర సురేష్ మీదే కేసులు పెడతావా అంటూ దాడికి దిగాడు. అందుబాటులో ఉన్న వస్తువుతో కుడి చెవిపై కొట్టడంతో పాస్టర్‌కు తీవ్ర గాయమైంది. ఇంతలో దాడిని గమనించిన బాధితుడి భార్య కేకలు వేస్తూ అడ్డురావడంతో ఆమె జుట్టు పట్టుకొని లాగి చెంపలు, నడుముపై దాడి చేయడంతోపాటు, దాడి ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న ఆమె ఫోన్‌ను పగలగొట్టారు. ఇంతలో నాగరాజుతోపాటు వచ్చిన కారు డ్రైవర్ కారులోంచి ఇనుప రాడ్డు తీసుకుని ఇంట్లో ఉన్న కుర్చీలు, ఇంటి రేకులు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితులపై జరుగుతున్న దాడిని మధ్యవర్తిగా మాట్లాడటానికి వచ్చిన ప్రకాశ్ అడ్డుకొని దాడికి పాల్పడుతున్న వ్యక్తులను వారించి అక్కడ నుంచి తీసుకెళుతున్న క్రమంలో తాము చెప్పినట్లు వినకపోతే చంపి జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని హెచ్చరికలుకు దిగారు. పాస్టర్ కుటుంబంపై జరిగిన దాడిని గమనించిన స్థానికుల సహకారంతో అదే రోజు రాత్రి కొల్లూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లిన బాధితులు, వారి సూచనల మేరకు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.



అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కేసు నమోదులో జాప్యం..!

చెవికి బలమైన గాయం అవడంతో అక్కడే చికిత్స పొందుతూ తెనాలి వైద్యశాల అవుట్‌పోస్టు పోలీసులకు తమపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. ఈనెల 17న తెనాలిలో చేసిన ఫిర్యాదు కొల్లూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క చెవి సక్రమంగా వినిపించని విధంగా దాడి చేసి, ప్రాణాలు తీస్తామని బెదిరింపులకు దిగినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లే కారణమన్న అనుమానాలు బాధితులు వ్యక్తం చేస్తున్నారు. తమపై దాడికి పురిగొల్పిన కత్తెర సురేష్ ఈనెల 21న విదేశం వెళ్లనున్న నేపథ్యంలో కేసు నమోదు చేయకుండా పోలీసులు సహకరిస్తున్నారని బాధిత పాస్టర్ జయరాజు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు విషయంలో జాప్యంపై ఎస్ఐ జి.ఏడుకొండలను వివరణ కోరగా, దాడికి గురైన పాస్టర్‌ను మంగళవారం కలసి మాట్లాడి వివరాలు తీసుకున్న అనంతరం కేసు నమోదు చేస్తామని బదులిచ్చారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య

విజయపురిసౌత్: పెట్రోల్ పోసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయపురిసౌత్‌లోని కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ పక్కన ఉన్న పాత లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ ఆవరణలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి ఆదివారం రాత్రి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు సాగర్‌మాత గుడి వద్ద అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో పలువురికి కనిపించినట్లు తెలిసింది. మృతదేహం వద్ద ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో కాషాయ రంగు టవల్, రెండు వాటర్ బాటిల్స్, రెండు బీడీ కట్టలు, ఒక అగ్గిపెట్టె ఉన్నాయి. మృతుడు యాచకుడని పోలీసులు భావిస్తున్నారు. గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ గురనాథ్‌బాబు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పాత లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద కాలిపోయి ఉన్న గుర్తు తెలియని మృతదేహం

డెల్టాకు 8,000 క్యూసెక్కులు సరఫరా చేయాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు రైతుసంఘం వినతి

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాకు 8,000 క్యూసెక్కులు సరఫరా చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తెనాలి డివిజన్ కమిటీ సోమవారం సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ కు వినతిపత్రం అందజేసింది. పెదవడ్లపూడి హైలెవెల్ చానల్‌కు రూ.3 కోట్లను కేటాయించడంతో పాటు 25 వేల ఎకరాల్లోని పంటలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు అయితానగర్ మహిళా పాడి రైతులకు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించాలని, పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ హామీనిచ్చారు. 2023–24 సంవత్సరంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇప్పించాలని కోరారు. కొల్లిపర మండలం వల్లపాపురంలోని జాయింట్ లైబిలిటీ మహి గ్రూపుకి రూ.5 లక్షలకు మరొక రూ.50 వేల రుణ సదుపాయం కల్పించి ఆ గ్రూపుకి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరినట్టు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. మహిళా పాడి రైతు సంఘం నాయకురాలు వేజెండ్ల తబిత మాట్లాడుతూ పశుపోషణ భారంగా మారినందున ప్రభుత్వరంగ సంస్థలు రైతులకు రుణాలు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో మాన్యం శ్యాంబాబు, మేకల అనసూయ, ఈపూరి బేబీరాణి మేకల ధనమ్మ, గొరికపూడి అరుణ, సునీత, తెనాలి నిర్మల, పద్మ, కూచిపూడి శకుంతల, తోట సరోజిని, వేజెండ్ల వజ్రమ్మ, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నేతలు

ఆగమ శాస్త్రాల్లో 'వైఖానస' శ్రేష్టం

టీటీడీ ఆగమ అధ్యాపకుడు ఫణికుమార్

తెనాలి: ఆగమ శాస్త్రాల్లో వైఖానస ఆగమ శాస్త్రం శ్రేష్టమైనదని తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి అధ్యాపకుడు దీవి ఫణికుమార్ అన్నారు. శ్రీ వైఖానస సేవా సంఘం, తెనాలి ఆధ్వర్యంలో విఖనస జయంతి రోజైన సోమవారం పట్టణంలోని గోవర్ధనస్వామి దేవస్థానంలో కొలువైన విఖనసాచార్య స్వామి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన పంచామృత స్నపన, విశేష అర్చన జరిపి బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన సభకు సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరు శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఫణికుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నైమిశారణ్యంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువే విఖనస మహామునిగా ఉద్భవించారని తెలిపారు. ఆయన ప్రధానమైన తొమ్మిది మంది రుషుల ద్వారా ఆగమ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించారని చెప్పారు. వైదిక మార్గంలో భగవంతుని చేరవచ్చు అనేందుకు భగవదర్చన క్రియను కూడా అందించిన మహర్షి విఖనసుడని వివరించారు. సభాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ వైఖానస ఆగమ శాస్త్రాన్ని, విఖనస మహాముని విశిష్టతను దశదిశలా వ్యాపింప చేసేందుకు వైఖానసులు కృషి చేయాలని సూచించారు. సేవాసంఘం నిర్వహిస్తున్న ధార్మిక, సేవలను వివరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు దీవి లక్ష్మీనరసింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.రఘు, కోశాధికారి యోగానంద చక్రవర్తి, పండిత వీఎల్ఎన్‌డీ భట్టాచార్యులు, నారాయణం రంగాచార్యులు, నారాయణం వేణుగోపాల్, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి, టీటీడీ భజన మండలి కన్వీనర్ రొంపిచర్ల కిరణ్‌కుమార్ మాట్లాడారు. దివి అంజనీకుమార్, వేదాంతం నాగమారుతి వేద పారాయణ చేశారు



ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదుతో ఫణికుమార్‌కు సత్కారం

ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం

సేవాసంఘం ఆధ్వర్యంలో పండిత దీవి ఫణికుమార్ కు ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని అగ్నిహోత్రం సనత్ కుమార్, అగ్నిహోత్రం శ్రీనివాస దీక్షితులు, రొంపిచర్ల శేషసాయి పర్యవేక్షించారు. రొంపిచర్ల లక్ష్మీనరసింహాచార్యులు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు అగ్నిహోత్రం నరసింహమూర్తిని అర్చక పురస్కారంతో సన్మానించారు. ఆగమ విద్యార్థులు నారాయణం సంతోష్, వేదాంతం కమలేష్‌కు ఆగమ విద్యార్థి పురస్కారాన్ని అందించారు. నారాయణం రంగాచార్యులు పర్యవేక్షణలో ఆచార్య స్వామి రథోత్సవం నిర్వహించారు.